


**మూడు దశల్లో ఖరీఫ్ సాగుకు నీటి సరఫరా**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 17 జులై , 2026 | పేజీలు : 5

# దేవరకొండ అభివృద్ధికి మరో ముందడుగు

### నూతన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాల కోసం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ సంబందిత అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో స్థల పరిశీలన నిర్వహించారు. ముందుగా నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం కోసం ఖిల్లా బజార్‌లోని పాత పోలీస్ స్టేషన్ స్థలాన్ని, బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి అనువైన ప్రాంతాలపై అధికారులతో చర్చించారు. అనంతరం పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ నూతన తహశీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన స్థల సౌకర్యాలపై తహశీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ పట్టణంలోని పాత బజార్‌కు కొత్తకలను సాకారం చేస్తూ ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించే విధంగా ఆధునిక వసతులతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నాం అని తెలిపారు. నూతన తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25కోట్లు, మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి రూ. 7.60కోట్లు మంజూరైనట్లు ఎంఎల్‌ఏ తెలిపారు. ఈ భవనాల నిర్మాణంతో పట్టణంలో ప్రభుత్వ సేవలు మరింత సమర్ధవంతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ స్థల పరిశీలనలో తహశీల్దార్, మునిసిపల్‌అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# వేగంగా సిఎంఆర్ డెలివరి

### రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ జి వి. శ్యాం ప్రసాద్ లాల్

### ఉమ్మడి నల్గొండ జిల్లా రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో కష్టం మిల్లింగ్ రైస్ పై సమీక్ష

100 రోజుల కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలి

వివరాలు మెయిన్‌లో

## శిథిలావస్థలో కొత్తగూడెం

# మేజర్‌కాలువ

### పొంచి ఉన్న ప్రమాదం





**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని రత్నవరం గ్రామం గుండా వెళ్తున్న 14బి కొత్తగూడెం మేజర్ కాలువపై నిర్మించిన బ్రిడ్జి లైనింగ్ పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థలోకి చేరింది. ఈ మేజర్‌కాలువ వంతెన కొన్ని ఏళ్ల క్రితం నిర్మించడంతో పూర్తిగా దెబ్బతిని ఏప్పుడు కూలిపోతుందోనని రైతులు, వాహనదారులు వాపోతున్నారు. అంతేకాకుండా ఈ వంతెనకు కూల్చివేసి కొత్త వంతెన నిర్మించకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటూ ప్రయాణికులు, వాహనారులు రాకపోకలు సాగిస్తున్నారు. నడిగూడెం మండలం రత్నవరం గ్రామం అనంత గిరి మండలం త్రిపురవరం గ్రామాల మధ్య రోడ్డు మార్గం డబుల్‌గా ఉండి వంతెన సింగిల్ కావడంతో ప్రయాణికులకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వంతెనకు ఇరు పక్కల రెయిలింగ్ పూర్తిగా దెబ్బతిని ప్రమాదం కొరలు తెరుచుకున్నాయి. వంతెనకు రెయిలింగ్ లేకపోవడంతో రాత్రి వేళ్లలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షకాల నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందో సంబంధిత ఎన్‌ఎస్‌పి, అర్‌అండ్‌బి అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ఉన్న బ్రిడ్జిని తొలగించి తక్షణమే కొత్త వంతెనను నిర్మించే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



## మహిళ సాధికారతతోనే సమాజం వికాసం

### మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని, సమాఖ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. గురువారం మండల కేంద్రంలో భారత జాతీయ మహిల సమాఖ్య మండలి మహాసభ అత్యంత ఉత్సాహం భరిత వాతావరణంలో జరిగింది. మహిళ హక్కులు వారి సామాజిక వికాసంపై చర్చించడంతో పాటు నూతన మండల కమిటిల ఏర్పాటు ధ్వేయంగా ఈ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారానికి సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం వివిధ శాఖల వారిగా సభ్యుల అర్హతలను పరిశీలించి అందరి సమక్షంలో పేర్లను అధికారికంగా ఖరారు చేశారు. మండల అధ్యక్షురాలుగా కంచర్ల సాంబ, ఉపాధ్యక్షురాలుగా నాగమణి, ప్రధాన కార్యదర్శిగా అల్లం రాజేశ్వరి, సహాయ కార్యదర్శిగా కామేశ్వరమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జాన్వీలను నియమించారు. ఈ నూతన కమిటి ఎన్నకల ప్రక్రీయంతా పారదర్శకంగా అందరి సమక్షంలో జరిగింది. జిల్లా అధ్యరాలు ఉప్పతల కోటమ్మ, జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, ఐలాపురం లక్ష్మి తో పాటు మండలంలోని పెద్ద సంఖ్యలో మహిళ ప్రతినిధులు, సంఘ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

## కేసులు పెండింగ్ ఉండొద్దు

### డిఎస్‌పి ప్రసన్న కుమార్



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** కేసులు పెండింగ్‌లో లేకుండా ప్రణాళిక ప్రకారం పనిచేయాలని సూర్యాపేట డిఎస్‌పి వి. ప్రసన్న కుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా గురువారం ఆయన రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పరేడ్‌ను పరిశీలించి, సిబ్బంది పరికరాలు పరిశీలించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ రికార్డులు, పరిసరాలు పరిశీలించి తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ మ్యాప్‌ను, గ్రామాల హద్దులను, కేసు ఫైల్స్‌ను, కోర్టు వ్యవహారాలు, రిసెప్షన్, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పరిశీలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై సమీక్షించారు. స్టేషన్ పరిధిలో గ్రామాలు, కాలనీలు, పట్టణాల్లో పెట్రోలింగ్, తనిఖీలు నిరంతరంగా చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని, మహిళా కేసుల్లో ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. ప్రతి విషయాన్ని రికార్డులలో నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాదపూర్వకంగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు క్షుణ్ణంగా చేయాలి, కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజశేఖర్, ఎస్‌ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## శంకరమ్మ పిఏస్‌గా శివ వాత్సల్య

**ప్రజాపక్షం/చింతపల్లి :** తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమించిన విషయం తెలిసిందే. శ్రీకాంతాచారి త్యాగాన్ని స్మరిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమించడం పట్ల గర్వంగా ఉన్నదని రుద్ర ఫౌండేషన్ చైర్మన్ శివ వాత్సల్య అన్నారు. మండల పరిధిలోని వింజమూరు గ్రామానికి చెందిన యాచారం శివ వాత్సల్య విలేకరులతో మాట్లాడుతూ తాను శంకరమ్మ పిఏస్‌గా చేరినందుకు సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా రుద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు నిరంతరాయంగా కొనసాగిస్తామని ఆ ఫౌండేషన్ చైర్మన్ శివ వాత్సల్య తెలిపారు.

## ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాస్

**ప్రజాపక్షం/చిట్యాలః** సంత్ రవిదాస్ జన్మదిన వేడుకల ఉత్సవాల కమిటి రాష్ట్ర కన్వీనర్‌గా నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన రాష్ట్ర బిజెపి మోర్చా నాయకులు మాస శ్రీనివాస్‌ను నియమించారు. నియామక పత్రాన్ని ఎస్‌సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్, పార్లమెంట్ సభ్యుడు మునిస్వామిల చేతుల మీదుగా గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో అందుకున్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని, ఎస్‌సి మోర్చా, బిజెపి పార్టీల బలోపేతం కోసం తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా మాస శ్రీనివాస్ తెలియజేశారు.

## వరి స్థానంలో ఆరుతడి పంటలు వేసుకోవడం మేలు



**ప్రజాపక్షం/వేములపల్లి:** వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవడం రైతులకు శ్రేయస్కారమని మండల వ్యవసాయ అధికారి కిషన్ నాయక్ అన్నారు, గురువారం మండలం లోని లక్ష్మీదేవి కూడా శెట్టి పాలెం, బుగ్గ బాయ్ గూడెం,ఆమనగల్లు గ్రామాలలో పర్యటించి వ్యవసాయ రైతులతో మాట్లాడారు,ఈ వానాకాలం ఎల్. నీనో ప్రభావం రైతులను ఇబ్బంది పట్టే పరిస్థితి ఉన్నదని వరి స్థానంలో ఆరుతడి పంటలు వేసుకోవడం వల్ల రైతులకు మేలుజరుగుతుందని అన్నారు. వరి పంటలకు సరిపడా నీరు లేకపోవడం వల్ల పంట నష్టపోయే పరిస్థితులే ఎక్కువగా ఉన్నాయని ఇప్పటికే వ్యవసాయ శాఖ ముందస్తు సమాచారం ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఎండి షఫీ, కే రమేష్,ఎం ప్రియాంక,మాజీ ఆదర్శ రైతు సైదిరెడ్డి,వ్యవసాయ రైతులు కూలీలు తదితరులు ఉన్నారు.

## వెల్ఫేర్ స్కీములు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించకుండా వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లకపాక రాజు,జిల్లా కమిటీ సభ్యుడు వంటేపాక వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం నకిరేకల్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు శంకర్,వెంకట్,నారాయణ,పాండు,పలక్ష్మయ్య, గిరి,కృపాకర్,రత్నం,శ్రీను పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం జాలుబాయి తాండ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని లబ్ధిదారుల కొత్త ఇళ్లను ప్రారంభించారు. భూక్య కోటేష్, దీరావత్ మోహన్, భూక్య లచ్చు, భూక్య రమేష్, ఆడోత్ నాగ, భూక్య సక్కుబాయి, మాలోత్ నాగు కుటుంబాలకు మంజూరైన ఇళ్లను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి



రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పారదర్శకంగా అమలవుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో జనాభా నియంత్రణ,కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కల్పించేందుకు ర్యాలీ,మానవహారం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా నల్లగొండ జిల్లాలో 2026 నాటికి దాదాపు 18 లక్షల జనాభా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.పెరుగుతున్న జనాభా వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి, సహజ వనరులపై పడే ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మానవహారంలో ఈ సంవత్సరపు నినాదమైన ప్రణాళిక బద్ధమైన కుటుంబం ఆరోగ్యవంతమైన సమాజం అభివృద్ధి చెందిన దేశం అనే అంశంపై డాక్టర్ రాహుల్ మాట్లాడారు. అనంతరం లైన్‌వాడకు చెందిన ప్రత్యూష భర్త ఆకాశ్ ఇద్దరు పిల్లల అనంతరం కుటుంబ నియంత్రణలో భాగంగా ఐ.యు.డి (ఇంట్రా యూటరైన్ డివైస్) పద్ధతిని స్వీకరించారు. వారిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. కుటుంబ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ దీప, డాక్టర్ కృష్ణకుమారి (పిఓడిటి), డాక్టర్ పద్మ (డిఐఓ),డాక్టర్ జమీర్,డాక్టర్ తిరుపతిరావు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్:** జిల్లా కాంగ్రెస్ కమిటీలో నూతనంగా వివిధ పదవులకు నియమితులైన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు.ఉపాధ్యక్షుడిగాబ్రహ్మదేవర రమేష్,ప్రధానకార్యదర్శులుగా మూరారిశెట్టి కృష్ణమూర్తి, చెవుగోని శ్రీనివాస్,గంగాధర పద్మ, కార్యదర్శులుగా మజీద్,ముత్యాలఅంజనేయులునియమితులైన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. నూతన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు లింగాల వెంకన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత,పన్నాల రాఘవరెడ్డి, గాజుల సుకన్య పాల్గొన్నారు.

**సూపర్ మార్కెట్ ప్రారంభం**



పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు.యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, పట్టణ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. సూపర్ మార్కెట్ నిర్వాహకులు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరోపణలు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తనపై జిల్లా యువజన అధ్యక్షుడు బొమ్మిడి అశోక్ చేసిన ఆరోపణలను నిరూపిస్తే వెంటనే అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బెలిదె శ్రీనివాస్ సవాల్ విసిరారు. గురువారం జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన గెలుపు కోసం కృషి చేసిన వారికి పదవులు ఇస్తానని ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. యువజన అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఆర్యవైశ్య సమాజానికి చేసిన సేవలేమిటో చెప్పాలని ప్రశ్నించారు. తాను అధ్యక్ష పదవిలో లేకపోయినా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిక్కుమళ్ల కృష్ణ, వుప్పల సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాస్, ఉప్పల శ్రవణ్ కుమార్, మిట్టపల్లి రమేష్, బొల్లం సురేష్, తోట లక్ష్మి నర్సయ్య, బచ్చు జగన్మోహన రావు పాల్గొన్నారు.

## క్యాచ్ ది రైన్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రతి బొట్టునూ భూమిలోకి ఇంకించేలా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలను చైతన్యపరచడానికి మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో వర్షపు నీటి నిల్వ నిర్మాణాల ప్రాముఖ్యతపై కౌన్సిలర్లు తమ వార్డుల్లో నిరంతరం ప్రజలతో మాట్లాడుతూ అత్యధిక సంఖ్యలో ప్రజలు వీటిని నిర్మించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. కమిషనర్ శ్రీజారెడ్డి గురువారం ఉదయం పలు వార్డులలో పర్యటించి నీటి నిల్వ గుంతల ఏర్పాటుపై చిన్నపాటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కౌన్సిలర్లందరూ దీనిని ఒక సవాలుగా తీసుకుని తమ ఇంట్లో వర్షపు నీటి నిల్వ గుంతను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పర్యావరణ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఒక్క ఓటు కూడా తొలగిపోవద్దు



**ప్రజాపక్షం/కోదాడ:** సర్ ప్రక్రీయలో అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం ఆయన నివాసంలో పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ప్రజాస్వామ్య పరిరక్షణలో అత్యంత కీలకమైన అంశమని అన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటర్ పేరు కూడా జాబితానుంచి తొలగిపోకుండా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సర్ కార్యక్రమాన్ని ప్రతి బూత్‌లో విజయవంతం చేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోని బిఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## ఓటర్లను చైతన్యపరచాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై ఓటర్లలో అనేక అనుమానాలు ఉన్నాయని క్షేత్రస్థాయిలో వాటిని నివృత్తి చేసి ఓటర్లను చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 42వ వార్డులో గణేష్‌నగర్ పార్కులో ఓటర్లకు అవగాహన కల్పించి దగ్గరుండి వారిచే ఎన్యుమరేషన్ ఫామ్‌లను నింపించి బిఎల్‌ఓలకు అందజేసి మాట్లాడారు. అనంతరం ఓటర్లచే ఎన్యుమరేషన్ ఫామ్‌లలో వివరాలు నమోదు చేయించి వారిలోని అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రూపేష్, సట్టు శంకర్, మధు, మహేష్, పరమేష్, జానీ, మధు, సైదులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ నియోజక వర్గ ఇంచార్జిగా సూరారపు కృష్ణవేణి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** తెలంగాణ రక్షణ సేన తుంగతుర్తి నియోజక వర్గ ఇంచార్జిగా సూరారపు కృష్ణవేణి నియమితులయ్యారు. ఈ మేరకు టిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన 23 మందిలో కృష్ణవేణికి అవకాశం కల్పించారు. తెలంగాణ జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా పనిచేస్తున్న కృష్ణవేణికి తుంగతుర్తి నియోజక వర్గం ఇంచార్జిగా ప్రకటించడం పట్ల పార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతుంది. భవిష్యత్తులో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసే అవకాశం ఉందని అధినేత్రి నిర్ణయం సంతోషకరమని టిఆర్ఎస్ శ్రేణులు, ఆమె అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. తనపై విశ్వాసం ఉంచి నియోజక వర్గ ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించిన అధినేత్రి కల్వకుంట్ల కవితకు ఈ సందర్భంగా కృష్ణవేణి కృతజ్ఞతలు తెలిపారు.



## పలకలు, పండ్లు పంపిణీ

**ప్రజాపక్షం/మునగాల:** విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యాలను కాపాడుకోవడంలో అంగన్‌వాడీ టీచర్లు మెరుగ్గా పనిచేయాలని దాత బొల్లెద్దు చిన్న వీరయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం అంగన్‌వాడీ 2లో విద్యార్థులకు తన కుమారుడు బొల్లెద్దు గిరీష్ జయంతి సందర్భంగా ఉచితంగా పలకలు, పండ్లు పంపిణీ చేశారు. బొల్లెద్దు శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్ వరకాల సునిత, ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** యువత మాదకద్రవ్యాల బారీన పడకుండా వారి భవిష్యత్‌ను కాపాడుకోవడమే లక్ష్యంగా హుజూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హనుమానాయక్ మాట్లాడుతూ నేటి యువతే దేశానికి భవిష్యత్ అని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సరదా అలవాట్లతో జీవితాలు కోల్పోవద్దు

**ప్రజాపక్షం/మోతె :** చిన్న వయస్సులో సరదాకు అలవాటుగా చేసుకున్న వ్యసనాలతో జీవితాలను కోల్పోవద్దని ఎస్ఐ బి. లచ్చిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మామిళ్ళగూడెం గ్రామంలోని శ్రీవేంకటేశ్వర విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో చదువుపై శ్రద్ధ పెట్టాలని తెలియని వయస్సులో మాదక ద్రవ్యాల బారిన పడవద్దన్నారు. డ్రగ్స్, గంజాయితో మానసిక శారీరక ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపిస్తాయని తెలిపారు. మాదక ద్రవ్యాల వల్ల పూర్తిగా ఆరోగ్యం చెడిపోయి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని చెప్పారు. గ్రామాల్లో గాని, పాఠశాల పరిసరాల చుట్టూ అనుమానాస్పదంగా కనిపించి వ్యక్తులపై వెంటనే 100కు గాని, పోలీస్ సిబ్బందికి గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యండి జానీమియా, ప్రధానోపాధ్యాయులు డి. రాములు, సైదులు, నర్సయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఇండియా అండర్-19 టీ20 కప్‌లో తెలంగాణ జట్టుకు టైటిల్




**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గ్రామానికి చెందిన యువ క్రికెటర్ జాలే సాత్విక్ రెడ్డి ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈనెల 14వ తేదిన ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రా వేదికగా నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్‌నేషనల్ టీ 2018వ అండర్19 కప్ పోటీలలో సాత్విక్‌రెడ్డి తన అద్భుత నాయకత్వంతో జట్టును విజేతగా నిలిపాడు. ఫైనల్ పోరులో తెలంగాణ జట్టు మహారాష్ట్ర జట్టును ఓడించి ప్రతిష్టాత్మక టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో చిత్రియాల గ్రామంతో పాటు చందంపేట మండలం, నల్గొండ జిల్లాకు సాత్విక్‌రెడ్డి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన తండ్రి చందంపేట మండల పిఏసిఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి తన కుమారుడిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాదించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సాత్విక్ రెడ్డి విజయంపై కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, క్రీడాభిమానులు పలువురు ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## మంత్రికి ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్ల వినతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ ఆరోగ్యశ్రీ ప్రభుత్వ ఆసుపత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను వినతిపత్రం రూపంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఇప్పటికీ తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేకపోవడం శోచనీయమన్నారు. తమను కాంట్రాక్ట్ పద్ధతిలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐఎఫ్ఎంఎస్ విధానం ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. వీటితో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ సౌకర్యాలను తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పనిచేస్తున్న ఆపరేటర్లకు గత 10 నుండి 12 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆరోగ్యశ్రీ ప్రభుత్వ ఆసుపత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్, ప్రతినిధులు నిఖిలేష్, రఘురామ్, నిరంజన్, నాగేష్, బాలు, కృష్ణ, సమత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ సరఫరా చేయని టెండర్‌దారుడిని బ్లాక్ లిస్టులో పెట్టాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో చికెన్ సరఫరా చేయని టెండర్‌దారుడిని ఉన్నతాధికారులు బ్లాక్ లిస్టులో పెట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ డివిజన్‌లోని 33 ప్రభుత్వ విద్యా సంస్థల్లో జూన్ 30 నుంచి ఇప్పటివరకు 17రోజుల పాటు టెండర్‌దారుడు చికెన్ సప్లయ్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు పౌష్టికాహారమైన చికెన్ పెట్టకపోడంతో విద్యార్థులకు సరైన మెనూ అందడం లేదన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం వేల కోట్లు ఖర్చు పెడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుంటే ఇక్కడ టెండర్ దారుడు మాత్రం విద్యార్థులకు చికెన్ సప్లయ్ చేయడం లేదన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోని టెండర్‌దారుడిపై చర్యలు తీసుకోని బ్లాక్ లిస్టులో పెట్టి మరొకరికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ సైదానాయక్, శ్రీకాంత్, నాగార్జున, శ్రీనివాస్, అజయ్‌కుమార్, యాదగిరి, వెంకటేశ్వర్లు, బాబు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలి




**ప్రజాపక్షం/మునుగోడు :** మండల రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలినీ జిల్లా వ్యవసాయ అధికారి ఉల్లోజు వినోద్ కుమార్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కల్వలపల్లి గ్రామంలో ప్రస్తుత వానాకాలం సీజన్లో ఎల్ నినో పరిస్థితుల ప్రభావం ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఉల్లోజు వినోద్ కుమార్ మాట్లాడుతూ. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలైన జొన్న ,సజ్జ ,మినుములు, నువ్వులు, కంది,వేరుశెనగ ,ఆముదము వంటి పంటలు వేయాలని పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. వరికి బదులుగా ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించి నాణ్యమైన దిగుబడులు పొందాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మజ , వ్యవసాయ విస్తరణ అధికారి మాధగోని నరసింహ గ్రామ రైతులు కొండ సత్యనారాయణ, పగిళ్ల హనుమంతు, గడ్డం కృష్ణయ్య, కూర్పాటి లింగయ్య, ఉప్పరి నరసింహ, వీరమల్ల యాదయ్య, కన్నబోయిన నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెట్టాలి

**ప్రజాపక్షం/మోతె :** మండల పరిధిలో జరిగే అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెట్టాలని కోదాడ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 29 గ్రామాల్లో డ్రగ్స్, గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలు గుట్టుగా అమ్మకాలు జరిపినా, కొనుగోలు చేసినా, వాడకం చేసిన, అక్రమ ఇసుక వ్యాపారం చేసి వారి సమాచారాన్ని స్థానిక పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. యేండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను వెంటనే పరిష్కారం చేసుకునే విధంగా ఇరువర్గాలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ బి. లచ్చిరెడిడ ఏఎస్ఐలు శ్రీరాములు, మల్లయ్య, సిబ్బంది శ్రీకాంత్, శ్రీనివాస్, రాజు, విజయ పాల్గొన్నారు.

## లింగాలలో కుట్టు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని లింగాల గ్రామంలో సూర్యాపేట జిల్లా ఏపిడి సురేష్ గురువారం పర్యటించారు. గ్రామంలో మహిళా శక్తి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాల దుస్తుల కుట్టు కేంద్రాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, స్వయం ఉపాధి సాధించడానికి ప్రభుత్వం ఇలాంటి బట్టలు కుట్టే కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ ఏపిఎం సైదయ్య, పెన్‌పహాడ్ ఏపిఎం అంజయ్య, సర్పంచ్ గార్లపాటి స్వర్ణ, ఆర్ఐ రంజిత్ రెడ్డి, అజీజ్ ఉన్నిసా, సిసి వెంకన్న, పద్మావతి పాల్గొన్నారు.

## చందంపేట మండల మేరు సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/చందంపేట;** జిల్లా మేరు సంఘం కమిటి ఆదేశాల మేరకు దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలల్లో మేరు సంఘం మండల కమిటిల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా గురువారం చందంపేట మండల మేరు సంఘం కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈసమావేశం దేవరకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పానుగంటి శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించగా సమావేశంలో సభ్యులందరి ఏకాభిప్రాయంతో నూతన మండల కమిటిని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా పానుగంటి శంకరయ్య, కార్యదర్శిగా రాపర్తి వీరయ్య, కోశాధికారి రేణుకుంట్ల లక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం బలోపేతం, మేరు సామాజిక వర్గ సంక్షేమం, విద్యా, ఉపాధి, హక్కుల పరిరక్షణ కోసం నూతన కమిటి సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

## దాడి చేసిన నిందితులను శిక్షించాలి

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం గాగిళాపురం గ్రామంలో బిజెపి నాయకుడిపై చేసిన కాంగ్రెస్ గుండాలపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్షించాలని గురువారం పోలేపల్లి గేటు వద్ద బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలేపల్లి గేటువద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇతరులపై దాడి చేయడం అధికార బలంతో పోలీసు వ్యవస్థ వారిపై కేసులు పెట్టకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సిగ్గుచేటని ఆయన అన్నారు. బిజెపి నాయకుడిపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ గాగిళాపురం మాజీ ఎంపిటిసి రామకృష్ణారెడ్డి పై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



## భిక్షపతి మరణం బాధాకరం

**ప్రజాపక్షం/మోటకొండూరు;** మోటకొం డూరు మండలంలోని తేర్యాలకు చెందిన బిఆ ర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు పంజాల సాయికిరణ్‌గౌడ్ తండ్రి పంజాల బిక్ష పతి మరణించడంతో గురువారం బిక్షపతి పార్థివదేహంపై పూలమాల వేసి నివాళుల ర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామ ర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఆలేరు మాజీ ఎంఎల్ఏ గొంగిడి సునిత మహేందరెడ్డి. నివాళులర్పించిన వారిలో జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఖలీల్, తేర్యాల బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు రాజు,బిక్షం, సాయికు మార్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఇంటిలో నీటి సంరక్షణ



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ మున్సి పాలిటి పరిధిలో గురువారం జల్ శక్తి అభి యాన్ క్యాచ్ ద రైన్ కార్యక్రమంలో భాగంగా జల్ సంవిధాన్ ప్రధాన భవనతో మున్సిపాలి టిలోని 7వ వార్డులో ప్రజలకు జల సంరక్ష ణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూగర్భ జలాల పరిరక్షణ, నీటి వృథా నివా రణ , ప్రతి ఇంటిలో వర్షపు నీటి నిల్వ వ్యవస్థ లను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. 7వ వార్డు కౌన్సిలర్ సాయిచంద్రగౌడ్, టిపిబివో వర్షిత, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సక్రునాయక్, మున్సిపల్ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా అధికారుల జల్ సంవిధాన్ ప్రతి ఇంటి బాధ్యత, ప్రతి పౌరుడి కర్తవ్యం అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు.

## బేటీ బచావో - బేటీ పడావోపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/నకిరేకల్ (కేతేపల్లి)** :మలండలం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం బేటీ బచావో బేటీ పడావో అవగాహన కార్య క్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులకు ఆన్‌లైన్ భద్రత, బాలల హక్కులు, బాలల రక్షణ, పోక్సో చట్టం, గుడ్ టచ్‌బ్యాడ్ టచ్,బాల్య వివాహాల నిషేధ చట్టం, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగ పడే 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్),100 (పోలీ సులు),181 (మహిళల హెల్ప్‌లైన్) సేవల గురించి వివరించి, అవసరమైన సమయంలో నిర్భయంగా వినియోగించుకోవాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో భరోసా కోఆర్డినేటర్ నళిని, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపా ధ్యాయులు, ఉపాధ్యాయినులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొ న్నారు.

## ధీరావత్ తండాలో గిరిజనుల 'శీత్లా' సంబరాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గిరిజన సంస్కృతి, ఆత్మ గౌరవ ప్రతీక అయిన శీత్లా భవాని పండుగ వేడుకలను మిర్యాలగూడ మండలం ధీరావత్ తండాలో భక్తజన సందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక లకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై శీత్లా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గిరిజన తండాలు చల్లగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరు కుంటూ జరుపుకునే ఈ పండుగ గిరిజన సంస్కృతికి అద్దం పడుతుందన్నారు. అనంతరం తండా పరిసరాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యా వరణాన్ని, ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, పచ్చదనం, పరిశుభ్రమైన వాతావరణం మన భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించా లని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయ కుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, మాజీ ఎంపీపీ జిందా, ఎంపీడీవో, ఎంపీఓ, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతిని ధులు, ప్రభుత్వ అధికారులు, తండా పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాళేశ్వరం నీటిని ఎల్లంపల్లికి మళ్లించాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రతి నీటి బొట్టును కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి స్పష్టం చేశారు. గురు వారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. వర్షాలు కురవక బావులు, బోర్లు, చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని, రైతులు సాగునీటికి, ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్ట పంటలు కూడా ఎండిపోయే పరి స్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థి తుల్లో జీవనదులైన కృష్ణా, గోదావరి నదులలో నీటి లభ్యతను సరిగ్గా అంచనా వేసి ప్రజలకు తోడ్పడాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటి నుంచి కనీసం రెండు టీఎంసీల వరకైనా లిఫ్టుల ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు మళ్లించి సాగునీటి ఇబ్బందులు తీర్చవచ్చని సూచించారు. కాళేశ్వరం మరమ్మతులకు ప్రత్యామ్నాయ మార్గాలను వేగంగా అన్వేషించాలని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ సిడబ్ల్యుసి పట్టిం చుకోకపోవడం విచారకరమని అన్నారు. రాష్ట్రంలోని నీటి వనరుల వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడానికి ఈనెల 18వ తేదీన సిపీఎం బృందం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టులను సందర్శిస్తుందని రంగారెడ్డి వెల్లడిం చారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రాగిరెడ్డి మంగారెడ్డి, మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, సిఐటియు నేతలు రామ్మూర్తి, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కటి ఇస్తే రెండు ఫోన్లు..

**బాలుడిని నమ్మించి మొబైల్, సైకిల్ అపహరణ**



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఒక్క సెల్ ఫోన్ ఇస్తే రెండు సెల్ ఫోన్లు ఇస్తానంటూ ఆశ చూపి, ఓ అపరిచిత యువకుడు చిన్న బాలుడిని నమ్మించి అతని వద్ద ఉన్న మొబైల్, సైకిల్‌తో ఉడాయిం చిన వింత మోసం మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. ఎన్ఎస్పీ క్యాంప్ పరిధిలోని ఇందిరా మహిళా శక్తి దుర్గా క్యాంటీన్ వద్ద గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. స్థానికంగా ఉన్న ఓ చిన్న బాలుడి వద్దకు వచ్చిన గుర్తు తెలియని యువకుడు మాయమాటలు చెప్పాడు. తన వద్ద ఉన్న సెల్ ఫోన్ ఇస్తే, దానికి బదులుగా రెండు సెల్ ఫోన్లు ఇస్తానని నమ్మబలికాడు. నమ్మిన బాలుడు తన వద్ద ఉన్న మొబైల్‌ను ఆ యువకుడికి ఇచ్చాడు. ఆ తర్వాత మరో ఫోన్ తీసుకువస్తానని నమ్మించిన సదరు యువకుడు బాలుడి సైకిల్‌ను కూడా అడిగి తీసుకుని అక్కడి నుండి క్షణాల్లో మాయ మయ్యాడు. ఎంత సమయం గడిచినా సదరు యువకుడు తిరిగి రాకపోవ డంతో ఆందోళనకు గురైన బాలుడు ఇంటికి వెళ్లి తన అమ్మమ్మకు జరిగిన విషయాన్ని వివరించాడు. జరిగిన మోసాన్ని గ్రహించిన కుటుంబ సభ్యులు ఒక్కసారిగా లబోదిబోమన్నారు. కాగా, నింది తుడు బాలుడితో మాట్లాడిన విషయాలు, మొబైల్, సైకిల్ తీసుకుని పరారైన దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ టీవీ కెమెరా పుటేజీలో రికార్డ్ అయినట్లు సమాచారం.

## వర్షాల కోసం చెరువుగట్టులో శతరుద్రాభిషేకం

**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి** : రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచన మేరకు దేవస్థాన ఛైర్మన్ వారాల రమ ఆధ్వ ర్యంలో స్వామివారికి 108 కల శాలతో శతరుద్రాభిషేకాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య వైభ వంగా నిర్వహించారు.అనంతరం రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతాంగం సుభి క్షంగా ఉండాలని కోరుతూ పొంగళి నైవేద్యం, వరద పూజ నిర్వహించారు. వరద పాయ సాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి అనంతరం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో మోహన్, అర్చకులు పోలూపాటి రామలింగేశ్వర శర్మ, ప్రధానా ర్చకులు, దేవస్థాన డైరెక్టర్లు ఇదుకుల సంపత్, లింగ స్వామి,చెరువుగట్టు సర్పంచ్ నలగూర కృష్ణయ్య, పలు వురు గ్రామాల సర్పంచులు, దేవస్థాన సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## ఘనంగా నాబార్డ్ 45వ జయంతి

**ప్రజాపక్షం/నాంపల్లి** : మండలం లోని దేవత్ పల్లిలో నాబార్డు 45వ జయంతి మహిళలతో కలిసి ఘనంగా నిర్వహించారు ఐఆర్డి ఎస్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఏర్పాటు చేసిన నాబార్డ్ 45వ జయంతి కార్యక్రమంలో జిల్లా డిడిఎం మేనేజర్ వినయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ దేశంలో అనేక రంగాలలో అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తుందని వ్యవసాయ బ్యాంకింగ్ రంగాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.మహిళలు నూతనంగా చిరుధాన్యాలు పాడి పరిశ్రమలో నూతన విధానంతో అభివృద్ధిలోకి వెళ్లాలన్నారు వచ్చే వారం నుండి పది రోజులు ట్రైనింగ్ ఏర్పాటు ఇస్తామన్నారు. మహిళా సంఘాల వారిని మెమెంటు ఇచ్చి సన్మానించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏసు సుంకి శాల పశువైద్యాధికారి స్వామి నాయక్,ఐకెపి సీసీ కిషన్,ఐఆర్డిఎస్ అధ్యక్షులు వాడపల్లి రమేషు సంస్థ సీఈవో నంద్యాల అఖిల్ మహిళలు పాల్గొన్నారు.

## బాధితులకు భరోసాగా మహేష్



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి భరోసాగా మాన వసేవే మాదవసేవ అనే నినాదంతో ముందుకు సాగుతున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఛైర్మన్ మబ్బు మహేష్ సేవలు వెలకట్టలేనివని ఇందులో భాగంగా గురువారం నూనెగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన అండెం స్వరూప, తుర్కలషాపురం గ్రామంలో ఇటీవల మరణించిన పాలోజు సత్యనారాయణ, కొమ్మా యిపల్లి గ్రామంలో కొండబోయిన పద్మ కుటుంబాలను పరామ ర్శించి ప్రతి కుటుంబానికి రూ. 5016లను ఆర్థిక సాయం అందజే యడం జరిగింది. ఈకార్యక్రమంలో వివాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, రాజశే ఖర్‌రెడ్డి, నవీన్, పరశురాములు, సురేష్, రాజు పాల్గొన్నారు.

## సిఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/నాంపల్లి :** మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగో పాల్ రెడ్డి సహకారంతో నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గురువారం వివిధ గ్రామాలకు సంబంధించిన సీఎం రిలీఫ్ చెక్కులు మొత్తం 42 చెక్కులు,మొత్తం డబ్బులు 13,61,500 రుపాయయలను బాధిత కుటుంబాలకు అందజేశారు. అనంతరం కత్తి రవీందర్ రెడ్డి మాట్లా డుతూ నిరుపేదల ఆరోగ్య భద్రతకు ఈ నిధి ఎంతో భరోసానిస్తుం దన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపి పూల వెంకటయ్య, నాంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజు (సంజీవరెడ్డి),నాంపల్లి టౌన్ ఉప సర్పంచ్ పానగంటి నిర్మల వెంక టయ్య గౌడ్,సుంకిశాల సర్పంచ్ కలకొండ దుర్గయ్య పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ వెరిఫికేషన్

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్టు చింతపల్లి పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సెంటర్లకు అంగన్వాడీ టీచర్ మరియు ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మర్రిగూడ మండలంలోని వారికి ఈ నెల 15వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరి ఫికేషన్ నిర్వహించినట్లు సూపర్వైజర్ సామ యశోద తెలి పారు.ఇంకా ఎవరైనా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాని వారు ఉంటే, శనివారం ఈ నెల 18వ తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.ఖరారు చేసిన తేదీలోగా హాజరు కాని వారి దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబ డవని ఆమె స్పష్టం చేశారు.

## శాస్త్రీయంగా సరిహద్దులు నిర్ణయించి డిజిటల్ రికార్డులు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని బట్లపల్లి గ్రామాన్ని ప్రభుత్వం భూ పునఃసర్వే కోసం ఎంపిక చేసిందని, ఈ మేరకు నేడు గ్రామసభ ఏర్పాటు చేయనున్నట్లు తాసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్ తెలిపారు.సర్వే ద్వారా భూ సరిహద్దులను శాస్త్రీయంగా నిర్ణయించి గ్రామ పటాలను ఆధునికీకరిస్తామన్నారు. ప్రభుత్వ, అటవీ, అసైన్డ్, పట్టా భూములను స్పష్టంగా గుర్తించి డిజిటల్ రికార్డులను రూపొందిస్తామని పేర్కొన్నారు.సర్వే అనంతరం భూ యజమానులకు భూధర్ కార్డులను జారీ చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామసభలో రైతులు,ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని సహకరించాలని కోరారు.

## ఎన్యూమరేషన్ ఫారాలు త్వరితగతిన ఇవ్వండి

**ప్రజాపక్షం/డిండి:** అర్హులైన ప్రతీ ఒక్కరి ఓటు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వడం ద్వారా ఉంటుందని ఎలాంటి అనుమానాలకు తావు లేదని ఓటర్లు త్వరితగతిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్‌వోలకు ఇవ్వాలని దేవరకొండ ఆర్డీవో పద్మప్రియ అన్నారు. దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 326 పోలింగ్ బూత్‌లు ఎనమిది మండలాల పరిధిలో ఉన్నాయని 326 మంది బిఎల్‌వోలు, 33 మంది సూపర్‌వైజర్లు, 8 మంది ఏఈఆర్వోలు పనిలో నిమగ్నమై ఉన్నారని మొత్తం ఓటర్లు 2,69,098 ఉండగా ఎన్యూమరేషన్ ఫా రాలను ఓటర్‌లకు ఇవ్వగా ఇందులో తిరిగి 2లక్షల557 ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్‌వోలు యాప్‌లో ఆన్‌లైన్ చేశారని ఇప్పటికే 76.39 శాతం నమోదైనట్లు తెలిపారు.

## డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** యువత మాదకద్రవ్యాల బారీన పడకుండా వారి భవిష్యత్‌ను కాపాడుకోవడమే లక్ష్యంగా హుజూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హనుమానాయక్ మాట్లాడుతూ నేటి యువతే దేశానికి భవిష్యత్ అని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని సూచించారు. సరదా కోసం అలవాటు చేసుకునే వ్యాసనాలు జీవితాలను రోడ్డున పడేస్తాయని హెచ్చరించారు. క్రళాశాల పరిసరాల్లో, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాని ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే లేదా డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పేదింటి తల్లి

### దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఓ పేదింటి తల్లికి ఆపద వచ్చింది కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది మెరుగైన వైద్యం అందించేందుకు చిల్లిగవ్వలేదు మనసున్న మహారాజులు తమకు తోసినంతలో సహాయం చేసి నిండు ప్రాణాన్ని కాపాడాలని కుటుంబ సభ్యులు దాతలను కోరుతున్నారు. మాడుగులపల్లి మండలం, తోపుచర్ల గ్రామానికి చెందిన ఓ పేద కుటుంబం ఆర్థిక కష్టాలతో కన్నీటి పర్యంతమవుతోంది. ఆ ఇంటి ఇల్లాలు, ఇద్దరు చిన్నారులకు తల్లి అయిన 35 ఏళ్ల పాల్వాయి సైదమ్మ తీవ్ర కిడ్నీ వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు.భార్య ప్రాణాలను కాపాడేందుకు చేతిలో ఉన్నదంతా ఖర్చు చేసిన ఆయన ఇప్పుడు దాతల సహాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.వైద్యుల అంచనా ప్రకారం కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతటి భారాన్ని భరించే స్థోమత లేకపోవడంతో, మనసున్న దాతలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి సైదమ్మకు పునర్జన్మ ప్రసాదించాలని వారు కన్నీటి వేడుకతో కోరుతున్నారు.మీరు చేసే చిన్న సహాయం మా కుటుంబానికి పెద్ద అండగా నిలుస్తుంది. ఇద్దరు చిన్నారుల తల్లిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్పందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.సహాయం చేయదలిచిన దాతలు గూగుల్ పే,ఫోన్‌పే: 99495 25672 కి పంపించగలరని కోరుతున్నారు.

## నిజాయితీకి మారుపేరు ఆటో డ్రైవర్...



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఓ మహిళ పోగొట్టుకున్న బ్యాగును ఆటో డ్రైవర్ పోలీసులకు అందజేసి తమ నిజాయితీని చాటుకున్నాడని వన్‌టౌన్ సీఐ ఎమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రశంసించారు. గురువారం సూర్యాపేటకు చెందిన షహానా బేగం అనే మహిళ నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రకాశం బజార్ కూరగాయల మార్కెట్ తన బ్యాగును పొరపాటున వదిలేసింది ఆ బ్యాగులో సెల్ ఫోన్,నగదు సహా విలువైన వస్తువులు ఉన్నాయి.ఆ మార్గంలో వెళ్తున్న ఆటో డ్రైవర్ మూకుండి నరేష్ ఆ బ్యాగును గమనించి ఎలాంటి స్వార్థం లేకుండా వెంటనే ఆ బ్యాగును తీసుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు అప్పగించాడు. ఈ సందర్భంగా సీఐ ఎమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వెంటనే స్పందించి బ్యాగు యజమాని షహానా బేగంను గుర్తించి స్టేషన్‌కు పిలిపించి ఆమె బ్యాగును, అందులోని సెల్‌ఫోన్, నగదు 4 వేల రూపాయలను అందజేశారు. పోయిందనుకున్న తన వస్తువులు తిరిగి లభించడంతో ఆమె ఆటో డ్రైవర్ నరేష్‌కు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం సీఐ ఆటో డ్రైవర్ నరేష్‌ను పోలీస్ స్టేషన్‌లో శాలువాతో సత్కరించి, అభినందించారు.

## తీగ లాగితే....డొంక కదిలింది

### పోలీసుల్ని తప్పుదోవ పట్టించిన వ్యక్తిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/నిడమనూరు:** తీగలాగితే,,,డొంక కదిలిన చందంగా కిడ్నాప్ నాటకమాడి పోలీసులని తప్పుదోవ పట్టించిన వ్యక్తిపై నిడమనూరు పోలీసులు కేసు నమోదు చేశారు. నిడమానూరు ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి ఊట్కూరు గ్రామానికి చెందిన బొల్లెపల్లి శేఖర్ ఈనెల 14న హాలియాలో కిరాణా సమానం తీసుకొని ఊట్కూరు వెళుతూ ఎక్కలూరి మైసమ్మ గుడి సమీపం నుండి ఊట్కూర్ వెళ్లే దారిలో రాత్రి 8 గంటలకు తన మోటార్ సైకిల్ ను ఆపి తనను కొంతమంది వ్యక్తులు కారులో వెంబడిస్తూ తరుముతున్నారని పోలీస్ వారి100కు, కుటుంబ సభ్యులకు కాల్ చేసి చెప్పడంతో పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నిడమనూరు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో అదే రాత్రి శేఖర్ పోలీసులకు, కుటుంబ సభ్యులకు మరొకరి సెల్లు ద్వారా ఫోన్ చేసి నిందితులు తనను కట్టేసి తీసుకువచ్చి చెరువు గట్టు సమీపంలో వదిలివేశారు. అని చెప్పడంతో పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి వెళ్లి శేఖర్ ని అదే రాత్రి తీసుకువచ్చి బుధవరం విచారించగా శేఖర్ ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో గురువారం పోలీసులు పూర్తి స్థాయిలో విచారించగా సంచలన విషయాలు వెలుగు చూశాయి. శేఖర్ పథకం ప్రకారమే ఈనెల 14న రోజు సాయంత్రం హాలియాలో కిరాణా సామాను తీసుకుని చెక్ పోస్ట్ వద్ద టోపీ, దస్సిగుడ్డ కొనుగోలు చేసి ఊట్కూరు పోయే దారిలో మోటార్ సైకిల్ ను ఆపి పోలీసులకు, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి దూరంగా పడేసి ఎవరు గుర్తుపట్టకుండా ముఖానికి దస్తిగుడ్డ కట్టుకుని బస్సు ఎక్కి నల్గొండ వెళ్లడం జరిగింది. 10 గంటల వరకు నల్గొండ బస్టాండ్ లోనే పచార్లు తిరిగి మళ్లీ బస్సు ఎక్కి చెరువుగట్టు వద్ద దిగి పక్క వారి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు, పోలీసులకు ఫోన్ చేయడం జరిగింది. ఇదంతా తనతో పాటు అనుముల గ్రామంలో 20 ఎకరాల భూమిని సేద్యం చేస్తున్న బత్తిని వెంకులయ్య తో ఇటీవల వ్యవసాయం చేసే విషయంలో ఏర్పడిన విభేదాల మూలంగానే వెంకులయ్యపై అనుమానం వచ్చేలా శేఖర్ కిడ్నాప్ డ్రామా ఆడినట్లు పోలీసులు తెలిపారు. ఈ వివరాలన్నీ సీసీ కెమెరాలు రికార్డు కావడంతో శేఖర్ ఆడిన డ్రామా గుట్టురట్టు అయింది, కిడ్నాప్ విషయంలో పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు బల్లేపల్లి శేఖర్ పై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## నూతన ఎంపిడిఓగా వెంకటయ్య

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** తిరుమలగిరి సాగర్ మండల నూతన ఎంపీడీవోగా కే. వెంకటయ్య గురు వారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఆయన దామ చర్ల మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిం చారు. డిప్యూటేషన్ పై తిరుమలగిరి సాగర్ మండల ఎంపీడీవో గా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాల అమలు లో పారదర్శకత పాటిస్తానని తెలిపారు.



## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి :** నార్కెట్‌పల్లి మండలానికి చెందిన 102 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వేముల వీరేశంకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/నకిరేకల్ :** 2025/26 విద్యాసంవత్సరానికి నిర్వహించిన నాసా అంతరిక్ష ప్రతిభా పరీక్షల్లోపట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు.గురువారం వారికి బహుమతులు అందజేశారు.ఈపరీక్షల్లో 11 మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. సిహెచ్. అక్షయ (9వ తరగతి), కే. జోష్ణవి (9వ తరగతి), ఎస్. వర్షిత (8వ తరగతి), కే. లాస్య (7వ తరగతి), వి. మైత్రి, జి. సిద్ధార్థ, ఎం. రోహిత్, కే. శ్రీవిద్య, బి. కీర్తన (6వ తరగతి)లను సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలోపాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య ,ఏజీఎం జయప్రకాశ్,సుజిత,హైస్కూల్ కోఆర్డినేటర్ ఎం. నాగేశ్వర రావు, ప్రిన్సిపల్ కాటంరాజు,డీన్ సుష్మ,ప్రైమరీ ఇన్‌చార్జ్ లావణ్య,ప్రీప్రైమరీ ఇన్‌చార్జ్ గీత,నాసా ఇన్‌చార్జ్ మారుతి పాల్గొన్నారు.

## పాలకులు మారుతున్నా.. పరిష్కారం నోచుకోలే!

### మూసీ రోడ్డుకు మోక్షం కలిగేనా?

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణ నడిబొడ్డులోని మూసీ రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు, పాదచారులకు నిత్యం ఇబ్బందులు కలిగిస్తోంది. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి బురదగా మారుతుండగా, ఎండాకాలంలో దుమ్ము దూళితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సంస్థలు ఉండటంతో పాటు కొందరు వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయడం వల్ల రాకపోకలు మరింత ఇబ్బందికరంగా మారుతున్నాయి.ఈ రహదారిపై అనేక రైస్ మిల్లులు, ట్రాన్స్‌పోర్ట్ సంస్థలు ఉండటంతో భారీ లారీలు, ఇతర వాహనాల రాకపోకలు అధికంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఇరుకుగా ఉన్న రోడ్డుపై భారీ వాహనాలు తిరగడంతో ఉదయం, సాయంత్రం, పాఠశాలల వేళల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఒక వాహనం ఎదురుగా వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొని, బస్సుల రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతోంది.ఆర్‌అండ్‌బీ, మున్సిపాలిటీ పరిధుల మధ్య బాధ్యతల గందరగోళంతో సమస్య ఏళ్లుగా అలాగే కొనసాగుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. పాలకులు మారుతున్నారు తప్ప రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదు అంటూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

